క్లుప్తంగా

వినికిడి యంత్రం అందజేత



వినికిడి యంత్రం అందిస్తున్న అరుణ్ కుమార్

బోథ్: సొనాల మండల కేంద్రానికి చెందిన కొండ రామకృష్ణ కుమారుడు సిద్ధూకు ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్ మంగళవారం వినికిడి యంత్రం అందజేశారు సిద్దూకు గతకొంత కాలంగా ఉన్న వినికిడి సమస్యపై తుల అరుణ్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహతో మాట్లాడారు. స్పందించిన మంత్రి రూ 4.20 లక్షల విలువైన వినికిడి యంత్రాన్ని అందజేశారు. కుటుంబసభ్యులు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గాజుల పోతన్న, కసిరే పోతన్న, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేశ్, పట్టణ అధ్యక్షుడు అనిల్, మాజీ సర్పంచ్ నరోత్తం రెడ్డి, సోయం బాపురావు, విజయ్ భాస్కర్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనేతరుల రిజర్వేషన్లను నిలుపుదల చేయాలి'

ఆదిలాబాద్‌టౌన్: ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఎన్నికల్లో గిరిజనేతరుల రిజర్వేషన్ నిలుపుదల చేయాలని టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. భద్రాద్రి, ఆదిలాబాద్, కుమురంభీం జెడ్పీ చైర్మన్ల స్థానాలను ఎస్టీలకే కేటాయించాలని పేర్కొన్నారు. 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనేతర రిజర్వేషన్ అమలు చేయొద్దని, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను గిరిజనులకే కేటాయించాలని కోరారు. ఇతర జిల్లాల కంటే ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన జనాభా అధికంగా ఉందని, జిల్లా పరిషత్ స్థానాల్లో ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు.

జీడిపల్లిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్

బోథ్: మండలంలోని జీడిపల్లె గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గతంలో గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. స్థానిక ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఎంపీడీవో రమేశ్, ఎంపీవో అతుల్‌కుమార్ మంగళవారం జీడిపల్లెలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి నస్రీన్ సుల్తానాకు సూచించారు.

వెళ్లిరా..బతుకమ్మ



ముత్నూర్‌లో నిమజ్జనానికి వెళ్తున్న మాంగ్ సమాజ్ మహిళలు

ఇంద్రవెల్లి: తొమ్మిది రోజులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో ఆడబిడ్డలు సందడి చేశారు. వెళ్లిరా బతుకమ్మ అంటూ మంగళవారం వీడ్కోలు పలికారు. మండల కేంద్రంతోపాటు ముత్నూర్‌లో మాంగ్ సమాజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, దనోరా, గౌరపూర్ తదితర గ్రామాల్లో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి కూడళ్ల వద్ద మహిళలు, యువతులు ఆడిపాడారు. రాత్రివరకు కోలాటాలతో నృత్యాలు చేశారు. అనంతరం శోభాయాత్రగా వెళ్లి గ్రామ పొలిమేరలో చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

సన్మానం



సన్మానిస్తున్న రాజ్‌గోండ్ సమితి సభ్యులు

బోథ్: ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు కొట్నాక్ నాగోరావ్, ప్రధానోపాధ్యాయుడు పదోన్నతి పొందిన నైతం జైతులను రాజ్‌గోండ్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులకు శాలువా కప్పి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పంద్రం శంకర్, నాయకులు మండాడి శంబు, నాగోరావ్, పెందూర్ సోనేరావు, మాడవి లాల్‌దేవ్, నాగోరావ్ ముగ్గల్, గంగారాం, మాధవ్ వెంకట్‌రావ్, రాజ్‌గోండ్ ఉద్యోగుల డివిజన్ అధ్యక్షుడు తొడసం భూమన్న పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో..



తాంసి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం

- తాంసి ప్రాథమిక సహకార సంఘం
- రుణాలందిస్తూ ఆర్థిక వృద్ధికి ప్రణాళికలు
- ఎరువుల విక్రయాలు, పంటల కొనుగోళ్లతో ఆదాయం
- అర్లి(టి), కరంజి(టి)లో గోదాంల నిర్మాణం పూర్తి

తాంసి: తాంసి ప్రాథమిక సహకార సంఘం అభివృద్ధి పథంలో ముందుకెళ్తోంది. రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు, వ్యవసాయేతర, బంగారు, ఇళ్ల నిర్మాణానికి, వాహనాల కొనుగోళ్ల రుణాలు అందిస్తోంది. దీంతోపాటు సంఘం ఆర్థిక వృద్ధిని సాధించేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. తాంసి సొసైటీ పరిధిలోని రైతులకు విరివిగా రుణాలందిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తోంది. సొసైటీ పరిధిలో తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాలు ఉండగా రైతులు సంఘంలో సభ్యులుగా చేరారు. ఇప్పటికే 5,687 మంది ఉన్నారు. ప్రస్తుతం వెయ్యిమందికి పైగా పంట, ఇతర రుణాలు తీసుకుని సాగు చేస్తున్నారు. ఎరువులను అందుబాటులో ఉండేలా సొసైటీ ఆధ్వర్యంలో మూడు గోదాంల నిర్మాణం చేపట్టారు. గిరిగాం, అర్లి(టి), కరంజి(టి) గ్రామాల్లో సంఘం చైర్మన్ అడ్డి భోజారెడ్డి సహకారంతో స్థలాలు గుర్తించారు. డీసీసీబీ బ్యాంక్ రుణం ద్వారా రూ.84 లక్షలు కేటాయించారు. కరంజి(టి)లో రూ.28 లక్షలతో 250 మెట్రిక్ టన్నులు, అర్లి(టి)లో రూ.30 లక్షలతో 300 మెట్రిక్ టన్నుల గోదాంల నిర్మాణాలు పూర్తి చేశారు. గిరిగాంలో సహకార సంఘం నిధులు రూ.26 లక్షలతో 150 మెట్రిక్ టన్నుల గోదాం పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే కరంజి(టి), అర్లి(టి) గోదాంల్లో ఎరువులను అందుబాటులో ఉంచడంతో అద్దె రూపంలో సొసైటీకి ఆదాయం వస్తోంది. సొసైటీకి రైతులతోపాటు పంటల కొనుగోళ్ల ద్వారా ఆదాయం సమకూరుతోంది.

పంటల కొనుగోళ్లతో ఆదాయం

రైతులకు అవసరమైన రుణాలు, కాంప్లెక్స్, రసాయన ఎరువులు సొసైటీ ఆధ్వర్యంలో విక్రయిస్తున్నారు. సోయా, కందులు, జొన్నల కొనుగోళ్లు చేపట్టడంతో కమీషన్ రూపంలో మార్క్‌ఫెడ్, నాఫెడ్ నుంచి సొసైటీకి ఏటా ఆదాయం సమకూరుతోంది. సొసైటీ ఈ ఏడాది ఇప్పటి వరకు 111 మంది రైతులకు రూ.కోటికి పైగా రుణాలిచ్చింది. సభ్యుల డబ్బులతోపాటు సొసైటీకి ఎరువుల విక్రయాలు, కొనుగోళ్ల ద్వారా వచ్చిన ఆదాయంలో రైతుల సంక్షేమం కోసం పలు అభివృద్ధి పనులు చేపడుతోంది.

తక్కువ వడ్డీకే రుణాలు



సహకార సంఘంలో రైతుల ఆర్థికాభివృద్ధి కోసమే వివిధ పనులు చేపడుతున్నాం. సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచడానికి గోదాంల నిర్మాణాలు చేపట్టాం. తక్కువ వడ్డీకే వ్యవసాయ, ఇతర రుణాలను అందిస్తున్నాం.

– అడ్డి భోజారెడ్డి, తాంసి సహకార సంఘం చైర్మన్

మరిన్ని సేవలు అందిస్తున్నాం



సహకార సంఘం పరిధిలో రైతులకు మరిన్ని సేవలందిస్తున్నాం. పంటల పెట్టుబడికి రుణాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నాం. రైతులు కార్యాలయంలో సంప్రదించాలి. కొత్త రైతులను సభ్యులుగా చేర్చుకుంటున్నాం.

– కేశవ్, సీఈవో

నేడు సామూహిక బతుకమ్మ సంబరాలు



మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్ ఖత్రి

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యాన బుధవారం సామూహిక బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి తెలిపారు. మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు సంబరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబరాల్లో పాల్గొనే మహిళలు తమ కాలనీకి సంబంధించిన బతుకమ్మలను అందంగా పేర్చి, గ్రూప్‌లవారీగా బతుకమ్మ పాటలపై ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందులో అత్యుత్తమంగా నిలిచిన వారికి ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శులు గెడం మాధవ్, సూర్యకాంత్ పడకంటి, కందుల రవీందర్, నర్సోజి, మహిపాల్, శశికళ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



కాంబు క్రాఫ్ట్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న స్థానిక పెద్దలు

నార్నూర్: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలని సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానందు నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, ఎస్ఈఆర్‌పీ సహకారంతో కాంబు క్రాఫ్ట్ యూనిట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న సామగ్రిలను వెదురుతో తయారు చేయాలని సూచించారు. ఐటీడీఏ మాజీ డైరెక్టర్ మాడవి మానకు, సాధార సంఘం డైరెక్టర్ కాంతారావు దుర్గే, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాథోడ్ ఉత్తమ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోకండేదేవరావు, దళిత రత్న అవార్డుగ్రహీత కె.మహేందర్, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె విరమణ



నిమ్మరసం ఇచ్చి సమ్మె విరమింపజేస్తున్న ఐటీడీఏ ఏవో స్వామి

ఉట్నూర్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, దినసరి ఉద్యోగులు చేపట్టిన నిరసన మంగళవారం 19వ రోజూ చేరింది. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉద్యోగులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతోనే సమ్మె విరమిస్తామని సంఘ నాయకులు ఏరుకొండ రాజన్న తెలిపారు. ఈ మేరకు ఐటీడీఏ ఏవో దామోదరస్వామి నిరసన చేస్తున్న వారికి నిమ్మరసం ఇచ్చి సమ్మె విరమింపజేశారు. కార్యక్రమంలో రాథోడ్ బాపురావు, రమేశ్, మానిక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డు

- మేడిగూడ(సి) నుంచి పిప్పల్‌గావ్ వెళ్లే దారి
- వర్షాలకు బురదమయం
- రాకపోకలకు ఇబ్బందులు



బురదమయంగా మేడిగూడ(సి) నుంచి పిప్పల్‌గావ్ వెళ్లేదారి

సాత్నాల: గ్రామీణ ప్రాంతాల్లో రహదారి అధ్వానంగా మారింది. చిన్న వర్షం కురిస్తే చాలు బురదమయంగా మారుతోంది. గుంతల్లో వర్షపు నీరు నిలుస్తుండడంతో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని మేడిగూడ(సి) గ్రామం నుంచి పిప్పల్‌గావ్ వెళ్లే రహదారి 2.5 కి.మీ నరకప్రాయంగా మారింది. మేడిగూడ (ఆర్), మేడిగూడ(సి), పార్డి(బి), మాంగుర్ల గ్రామాల వాహనదారులు, ప్రజలు జైనథ్ మండల కేంద్రానికి చేరుకోవడానికి ఇదే ప్రధాన రహదారి. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లడం, అత్యవసరాల కోసం ప్రయాణించే ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వస్తే మేడిగూడ(సి) గ్రామం నుంచి కుడి కాలువ వరకు గుంతలమయమై ప్రయాణం కష్టంగా మారుతోంది. రాత్రివేళ రాకపోకలు సాగించే వాహనదారులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ విషయమై గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులను ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టించుకోవాలి



వ్యవసాయ పనుల నిమిత్తం సామగ్రి తరలించేందుకు ఇబ్బందిగా ఉంది. గుంతల రోడ్డుతో రాత్రి వేళ వాహనాలు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకుని రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి.

– చిట్యాల రాకేశ్, మేడిగూడ(సి)

రోడ్డు నిర్మించాలి



రోడ్డు నిర్మాణం కోసం గతంలో నాయకులు, అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోలేదు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వర్షాలకు బురద అవుతుంది. కెనాల్ మేడిగూడ నుంచి ఎడమ కాలువ వరకు రోడ్డు నిర్మించాలి.

– క్యాతం శివప్రసాద్‌రెడ్డి, మేడిగూడ(ఆర్)

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- నిర్వహణ గాలికొదిలేసిన ప్రత్యేకాధికారులు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



తలమడుగు మండలంలో నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు

తలమడుగు: చెత్తతో సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. ప్రతీ పంచాయతీకి ఉపాధిహామీ ద్వారా వీటిని నిర్మించారు. స్వచ్ఛభారత్, సర్వేక్షణ్ గ్రామీణ్ పథకాల్లో భాగంగా చాలాచోట్ల ఉపయోగించి సంపద సృష్టించి విక్రయించిన దాఖలాలు ఉన్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన షెడ్లు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. ప్రత్యేకాధికారుల పాలనలో వీటి నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. మండలంలోని 29 పంచాయతీల్లో 25 సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. తడి, పొడి చెత్త సేకరణకు ట్రాక్టర్లను అందించారు. గ్రామాల్లో ప్రతీరోజు తడి, పొడిచెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి సేంద్రియ ఎరువులు తయారీ చేసి పంచాయతీలకు సంపద సృష్టించేలా ప్రణాళిక రూపొందించారు. సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేక ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుల్లో లేదా రోడ్డు సమీపంలో పాడేస్తున్నారు.

ఎరువుల తయారీ ఇలా..

గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేస్తారు. తడి చెత్తను డీకంపోజ్ చేయడంతో రెండు రోజుల్లో పూర్తిగా కుళ్లిపోతుంది. దీన్ని సెగ్రిగేషన్ షెడ్లలో బెడ్‌పై వేయడంతో అప్పటికే ఉన్న వానపాములు చెత్తను సేంద్రియ ఎరువులుగా మారుస్తాయి. వారంలో దాదాపు 2 క్వింటాళ్ల సేంద్రియ ఎరువు తయారవుతుంది. వీటిని 20, 50 కిలోల బస్తాల్లో నింపి రైతులకు విక్రయిస్తారు. దీంతో పంచాయతీలకు ఆదాయం వచ్చేది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్లు వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. పంచాయతీలకు ఆదాయం కోల్పోవడం, లక్ష రూపాయలు వెచ్చించి నిర్మించిన షెడ్లు వృథాగా ఉన్నాయి. అధికారులు వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

– పద్మాకర్‌రెడ్డి, తలమడుగు

ఆదాయం సమకూర్చాలి



ప్రత్యేకాధికారుల పాలనలో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. రోజు ఇంటింటికీ చెత్తను సేకరిస్తున్న ట్రాక్టర్‌తోపాటు సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి ఖర్చవుతుంది. అధికారులు సెగ్రిగేషన్ షెడ్లు ఉపయోగంలోకి తీసుకువచ్చి జీపీలకు ఆదాయం సమకూర్చాలి.

– నక్క ధనుంజయ్, రుయ్యాడి

చర్యలు తీసుకుంటాం



మండలంలోని సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. నిధుల కొరతతో షెడ్లు వినియోగంపై దృష్టిసారించలేదు. త్వరలో పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసి చెత్త నుంచి సంపద సృష్టించేలా చర్యలు తీసుకుంటాం.

– శంకర్, ఎంపీడీవో

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



బేల: భవానిగూడలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



నేరడిగొండ: వడూర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్/నేరడిగొండ/బేల/ఆదిలాబాద్/తలమడుగు/ఇచ్చోడ/ఇంద్రవెల్లి: జిల్లాలో దేవీనవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. దుర్గాదేవి మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మంగళవారం కుంకుమార్చనలు నిర్వహించగా మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. బోథ్ మండలకేంద్రంతోపాటు గ్రామాలు, నేరడిగొండ మండలం వడూర్‌లో అమ్మవారిని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. బేల మండలం భవానిగూడలో కొలువుదీరిన భవాని మాతాకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేలను సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీలో శ్రీ నవదుర్గ మండలి ఆధ్వర్యంలో దుర్గాదేవి మండపంలో భజన నిర్వహించారు. గురుకృప భజన మండలి కళాకారుల ఆధ్వర్యంలో చేపట్టారు. యక్షగానాలతో భజన బృందం అలరించింది. ఇంద్రవెల్లి మండలం హర్కపూర్‌తండా, దొడంద గ్రామాల్లో సేవాలాల్ ధర్మ ప్రచారక్ ఆడే ప్రేమ్ మహరాజ్ ఆధ్వర్యంలో బోగ్ బండార్, తదితర పూజలు చేశారు. లంబాడితండాలోని జగదాంబదేవి, సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో పూజలు జరిగాయి. బోథ్‌లో ఇటీవల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో భరతనాట్యం చేసిన విద్యార్థినులకు దుర్గాకమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.



ఇచ్చోడలోని టీచర్స్ కాలనీలో..



జిల్లాకేంద్రంలో భజన చేస్తున్న కళాకారులు

కాంగ్రెస్‌లో చేరిక



సోమన్నకు కండువా కప్పుతున్న అరుణ్ కుమార్

బోథ్: సొనాల మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మునేశ్వర్ సోమన్న మంగళవారం పార్టీకి రాజీనామా చేశారు. పార్టీలో సముచిత గౌరవం లభించడం లేదని పేర్కొన్నారు. రాజీనామా అనంతరం ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దేశ సమగ్రత కోసం పాటుపడాలి



పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

ఇచ్చోడ: దేశ సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహ సేవా ప్రముఖ్ బలవంత్రి గణేశ్ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలోకి అడుగిడుతున్న సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1925లో విజయదశమి రోజు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడిందన్నారు. వందేళ్ల నుంచి అనుకున్న లక్ష్యం కోసం ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఖండ కార్యవాహ ఓరగంటి చైతన్య, స్వయం సేవక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి

బోథ్: సొనాల మండల కేంద్రంలోని రామాలయంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రచార ప్రముఖ్ శ్రీనాథ్, ఖండ కార్యవాహ కొస్మెట్ శుద్ధోధన్, జిల్లా ధర్మ జాగరణ ప్రముఖ్ ఉత్తర్వార్ నాగేందర్, స్వయం సేవకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం



ఇచ్చోడ: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ రోడ్లపై వెళ్లేవారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. చిన్న పిల్లలు బయటకు వెళ్లడానికి భయపడుతున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే పట్టించుకుని కుక్కల బెడద నివారించాలని కాలనీవాసులు కోరుతున్నారు.